మా అందరికీ గొంతులో ఏదో అడ్డం పడినట్లయింది.

"అదేమిటండీ?" అన్నాను నేను. శేషయ్య మళ్లీ అందుకుని యిలా అన్నాడు.

"ఏముంది. ఆమె భర్త కొత్తగా ఒక కోడెదూడను కొన్నాడట. దానిని బండికికట్టి తోలుతున్నాడట. అది, ఏంచేతనోగాని బెదిరి ఆ బండిని లాక్కొని మిట్టనక పల్లమనక పరుగెత్తి ఒక గోతిలోకి తోసిందట. రమణ భర్త బండి క్రింద పడి చచ్చిపోయాడట. జరిగిన సంగతి ఇది. కాని ఆమె భర్త మరణానికి కారణం నేను అయినట్లూ, ఆపాపం అంతా నా నెత్తి మీద వున్నట్లూ నాకు అనిపించింది. ఈ పదిహేను సంవత్సరాలు నేను రమణ మొహం చూడలేదు." అని శేషయ్య ముగించి వేశాడు.

# ఆ స మ య ం

ఆరు నెలల అబ్బాయిని తీసుకుని, పుట్టింటి నుంచి అత్తింటికి ప్రయాణం కడుతూ వుండగా, కలరా తగిలి భర్త చనిపోయాడని మంగమ్మకి కబురు తెలిసింది. గోడు గోడున దుఃఖిస్తూ తన దురదృష్టాన్ని తిట్టుకుంది. ఆరు నెలల పిల్లాడి అదృష్టలేమికి విచారించింది.

అత్తారిల్లంటే మంగమ్మకి, అత్తా, మామా, ఆడుబిడ్డలూ ఎవరూ లేరు. ఇద్దరు మరదులున్నారు. వారిద్దరికీ భార్యలున్నారు. వాళ్ళలో ఎవరికీ పిల్లలు లేరు.

అన్నదమ్ములు ముగ్గురూ వుమ్మడిగానే వుండి, పొలమూ పంటా చూసుకుంటూ వుండేవారు, తమ్ముళ్లు యిద్దరికీ అప్పుడప్పుడు యేవైనా పోట్లాటలు వచ్చినా, పెద్దన్న సర్ది వేస్తూ వుండేవాడు. పెద్దన్న అంటే తమ్ముళ్లిద్దరకీ గురి అవడంచేత అతని మాటా, పెత్తనమూ సాగిపోవడమే కాక, మంగమ్మ అంటే కూడా మరదులకి కొంచెం నమ్రత వుండేది. అంచేత వాళ్ల భార్యలు కూడా మంగమ్మ విషయంలో చాలా గౌరవభావాన్ని చూపిస్తూ

వుండేవారు. మరదులు తమలో తాము ఏమైనా అభిప్రాయభేదాలు పొందినట్లయితే, ఆమె దగ్గర చెప్పుకునే వారు. గొడవలన్నీ ముగుడిదాకా పోనియ్యకుండా ఆమె సర్దివేసేది. మరీ ఆపరానంత గొడవ అయినప్పుడు, వాళ్ళిద్దరూ పైకి పోట్లాడుకోవడమూ, పెద్దన్న వాళ్ళిద్దర్నీ కొంచెం గదమాయించి, కాస్త కసురుకోవడమూ, అంతటితో ఆ కలహం సద్దుమణగడమూ జరిగేది.

భర్త చనిపోయిన తరువాత, అతని అంత్యక్రియలన్నీ జరిగిన తరువాత మంగమ్మ ఆలోచన తన బ్రతుకు మీదికి వెళ్ళింది.

తన భర్త బ్రతికి వుండబట్టి, తన మరదులూ, తోటి కోడళ్ళూ తనంటే గౌరవం చూపించే వారు కాని, యిప్పుడు పూర్వపు మర్యాద తనకు జరుగుతుందా? తన పిల్లాడి ముద్దు ముచ్చటలు తీరుతాయా? వాళ్ళకి కూడా పిల్లలు పుట్టేదాకా వొక వేళ, తనకొడుక్కి కొంచెం గారాబము సాగినా, ఆ తరువాత దిక్కు లేని వాణ్ణీ, తమమీద ఆధారపడ్డవాణ్ణీ చూసినట్టు చూడరా? ఈ విధంగా సుళ్ళింది మంగమ్మ ఆలోచన; కాని తనంతట తాను ఏమీ పైకి మాట్లాడలేదు.

మంగమ్మ తండ్రి యేదో ప్రస్తావనగా, 'ఆస్తి యేదో కుర్రాడి టా పంచుకుని వేరుగా వుంటే మంచిదేమో' అని మంగమ్మ మరదులతో అన్నాడు.

'అదేమిటి మామా! మాకు కాస్త ఆలోశనా, పాలోశనా చెప్పేందుకూ చేసేందుకూ పెద్దమనిషిగా యింట్లో వుంటది. పిల్లోణ్ణి మా నెత్తిన బెట్టుకుంటాం. మా ఆడోళ్ళకి, ఆమె మీద పెద్ద శ్రద్ధ గందా, అల్లాంటిదానికి యేర్లు పడడమేంటి?' అని పెద్ద మరది, తమ వదినగారిని పువ్వులలో పెట్టి పూజిస్తామనే నమ్మకం యిచ్చాడు. పెద్దమరది అలా చెపుతూ వుంటే, అతనితో విరోధం పెట్టుకోవడము యెందుకని, మంగమ్మ మాట్లాడలేదు.

అన్నట్టుగానే, మరదులిద్దరూ ఆమె మాట దాటకుండా వుండేవారు. పెద్దన్న బ్రతికి వుండగా ఎంత భక్తి, మర్యాదా చూపేవారో అలాగే

యిప్పుడూ నడుచుకుంటున్నారు.

మంగమ్మ కాపరానికి వచ్చేటప్పటికి మరదులు గోచీపెట్టుకొని ఆడుకొనే వయస్సు వాళ్లు; వాళ్ల పెళ్లిళ్ళు పేరంటాలూ తన చేతిమీదుగా చేసింది. తనకు మటుకు ఆలస్యంగా కాన్పు వచ్చింది గాని లేకపోతే, యీ పాటికి అయిదారుగురు బిడ్డల్ని కనివుండేది. అంచేత మంగమ్మ, వాళ్ళకి వదినగారిలా కాక, తల్లిలాగేవుంది. మంగమ్మ వయస్సు దాదాపు ముప్పయి యేళ్లు. ఆమె పెద్ద మరిది సుమారు యిరవై మూడు యిరవై నాలుగు ఏళ్ల వాడు. వయస్సు చేతకూడా ఆమె యింటికి పెద్ద; కాపరానికి వచ్చినప్పటి నుంచీ పెద్దమనిషి అనీ, ఉత్తమురాలనీ, పేరు పొందింది.

ఆ బజారులో వున్న ఆడవాళ్ళందరిలోకీ మంగమ్మే అందకత్తె. ఆమె కాపురానికి వచ్చిన కొత్తలో, చాలా రోజులదాకా, ఆ బజారులో పోకిరీవాళ్లు తిరుగుతూ వుండేవారు కాని, ఆమె అలాంటిది కాదనీ, తమకు లోబడదనీ తెలుసుకొని, అటురావడము మానివేశారు. ప్రతి యింటి కోడలిమీదా ఏదో ఒకటి చెప్పుకొనే, ఆ వూరి అమ్మలక్కలికి మంగమ్మని గురించి చెప్పుకుందుకు యేమీ కనపళ్లేదు.

ఇన్ని విధాల యింట్లోనూ, వూళ్లోనూగూడా ఆమె ఘరానా మనిషే అనిపించుకుంది. వూళ్ళోవాళ్లు చూపించే మర్యాదకి యింట్లో వాళ్ళు ఆమె మీద గౌరవభావాన్ని ఎక్కువ చేసుకున్నారు.

భర్త పోయినా మరదులతోనే ఆమె ఒకే యింట్లోవుంటూ వున్నందుకు ఆ వూరి వాళ్లు ఆమెను మెచ్చుకున్నారే కాని, అపవాదులు యేమీ వెయ్యలేదు.

మంగమ్మకీకూడా ఏమీ ఇబ్బంది లేకుండానే వుంది. నాలుగు నెలలు గడిచిపోయాయి.

మరదులిద్దరూ పొలం వెళ్లారు. చిన్న తోడికోడలు పొలంవెళ్లిన మగవాళ్లకి అన్నం తీసుకువెళ్లింది, పెద్ద తోటికోడలు, ఊరి బయట వున్న చొప్పదొడ్లో వేసిన పొరతీగ నుంచి కాయకోసుకు రావడానికి వెళ్లింది.

సాయంత్రం మూడు గంటలు అయింది. కొడుకు నిద్దర పోతున్నాడు. మంగమ్మ పెరట్లో వున్న దానిమ్మ చెట్టునవున్న కాయలు పక్షులు కొట్టి వెయ్యకుండా గుడ్డలు కడుతోంది.

ప్రక్క-యింటి మిద్దెమీద నుంచి యీలపాట వినపడి అటు చూసింది. ఆ యింట్లో అద్దెకి వున్న పోలీసు కాన్స్టేబిలు వీరయ్య అప్పుడే బీటునుంచి వచ్చి, ఏ వూళ్ళో నించో తెచ్చుకున్న పండు మిరపకాయలు మిద్దెమీద ఆరబోస్తూ యీమెను చూసినట్టున్నాడు, యీల వెయ్యడం ఆరంభించాడు.

ఆమె అటు చూడగానే, చిరునవ్వు నవ్వాడు. ఆమె తలవంచుకొని తన పని చేసుకుంటోంది. తన కేసి చూసి యిదివరకు యెవరూ చిరునవ్వు నవ్వలేదు. అంచేత ఆమె ఆలోచిస్తోంది యిదేమిటా అని; అందులోనూ పోలీసులంటే, వాళ్ళందరికీ అదో మాదిరి భావము. వాళ్ళు సర్కారు అధికారులనే గౌరవభావమూ, వాళ్ళతో విరోధం పాముతో చెలగాటం లాంటిదనే భయమూ, దయాదాక్షిణ్యం లేకుండా వాళ్లు యితర్లని బాధిస్తారనే కోపమూ.

మంగమ్మ తల వంచుకొనే వుంది. ''మీ మరదులు యింట్లో లేరూ ?'' అన్నాడు వీరయ్య. మంగమ్మ తలయెత్తి చూసింది. అతడు మిద్దెమీదనుంచి ముదురు గోడ మీదికి దిగి వచ్చాడు.

ఏం చెప్పాలో ఏమిటో ఆమెకి తెలియదు.

'పొలం బోయి రాలే' అని నిజం చెప్పింది. అతని మొహాన చిరునవ్వు మళ్లీ కనపడింది 'తోటికోడళ్లు కూడ ఆళ్ల యెంట బోయినారా ?' అన్నాడు అతడు.

'వొకామె అన్న మెత్తుకొని పోయింది' అని మంగమ్మ నిజమే చెప్పింది.

'రెండో ఆమె యింట్లో వుందా ?' అన్నాడు.

ఏ కారణం చేతనైనా అబద్ధం చెప్పవలసి వస్తుందని కాని, అతనికి ఆ సమయంలో అబద్ధం చెప్పాలని కాని, ఆమె అనుకోలేదు. అతడు వేసే ప్రశ్నలకు కారణమేమిటో ఆమె ఆలోచించలేదు. అతడు, అడుగుతున్నాడు. ఆమె

చెపుతోంది. అంతే. 'లేదు; చొప్ప దొడ్డికి పోయింది' అని అతనికి ఆఖరి సమాధానం చెప్పి వేసింది.

'లోపలికి దిగేదా ?' అన్నాడు వీరయ్య.

ఎందుకూ......ఆమెకి అర్థమయింది, ఇప్పటికి అర్థమయింది అతని మనోభావం.

కాని అతనికి సమాధానం ఏమని చెప్పాలి!

'ఎందుకూ ?' అన్నది.

'ఇంట్లో ఎవరూ లేరుగా—' అతడు నిలివడున్నచోట గోడాదూకి లోపల పడ్డాడు. ఆమె గాభరా పడ్డది.

'ఏమిటది ? ఎందుకు ? ఎందుకు ?'

అని గబగబా అడిగింది. ఏం చెయ్యాలో ఆమెకి తోచలేదు. 'నీకోసమే. ఇంట్లో ఎవరూలేరు-నిన్ను చూసినాలనుంచి, నాకు మనసు కుదటపడితే వొట్టు' అంటూ ఆమె దగ్గరికిచేరి, ఆమెను దగ్గరగా లాక్కున్నాడు. ఆమెకి యిష్టమూ లేదు. అయిష్టమూ లేదు. 'ఇంట్లో ఎవరూ లేరుగా' అని అతడు పదే పదిసార్లు అనడం ఆమెను తిరుగుబాటు చెయ్యనండా చేసింది. అతని కోర్కెకి ఆమె అడ్డలేదు......................................................

'మళ్లీ ఎప్పుడు ?' అని అడిగాడు ఆమెను.

'నీ యిష్టం' అంది మంగమ్మ.

'రేపు మాపటికి, పది గంటలవేళ, ఇక్కడికే రా' అని ఆమెకు చెప్పి, అలాగే ననిపించుకొని, గోడ మూలన వున్న నిచ్చెన వేసుకొని గోడయెక్కి, మిద్దెమీదికి పోయినాడు వీరయ్య.

సంవత్సరంన్నర పైగా అయింది, మంగమ్మ మగవాడితో సుఖంయెరిగి. కొన్నాళ్లు మరిచిపోయింది. జ్ఞాపకంవచ్చిన తరువాత, ఇక లాభం లేదను కుంది. తన తోటికోడళ్లు వూళ్లో వున్న కొంతమంది వ్యభిచారిణులనుగురించి యేదేనా చెవుతూ వుంటే వాళ్లకి ఎలా సాగుతుందా అను కునేది.

కాని ఇవ్వాళతో ఆ ఆలోచనలన్నీ తీరిపోయాయి. శరీరమంతా వొక్కసారి మత్తు వదలించుకున్నది.

రేపు రాత్రి ఎప్పుడవుతుందా అనే ఒక్క ఆలోచన తప్ప మనసులో యింకేమీ లేదు. ఇంట్లో ఎవరూ లేరు కనుకనూ, ఎవరూ చూడరు కనుకనూ, యీ వ్యవహారం బయటి వాళ్లకి యెరివకి తెలియదు__అంచేత భయం ఏమీ లేదు.

మరునాటి రాత్రి, అందరూ అన్నాలు తిని పడుకున్న తరువాత, అనుకున్న వేళకి అక్కడికి వెళ్లి అతన్ని కలుసుకున్నది. మళ్లీ మర్నాడు; ఆ మర్నాడు.

వీరయ్య డ్యూటీమీద ఏదో వూరు వెళ్లాడు. ఆమె పడ్డబాధ అంతా యింతా కాదు. 'మీ ఆయన వూళ్లో లేడా!' అనీ, 'శానా రోజులయి వట్టుందే' అనీ వీరయ్య భార్యని యేవో ప్రశ్నలు అడిగి, ఆమెద్వారా అతను యెప్పుడు వస్తాడో తెలుసుకుందామని ప్రయత్నించింది. కాని భర్త ఎప్పుడు వస్తాడో వీరయ్య భార్యకి మాత్రం ఏం తెలుసు! ఫలానప్పుడు వొస్తాడని తెలియక పోవడంవల్ల మంగమ్మకి అతని రాకకోసం ఆత్రం యెక్కువయింది.

ఆ వారం రోజులూ ఆమె పడ్డబాధకి అంతులేదు. అతడు వచ్చాడు. ఆ రోజు సాయంత్రం తొందరగా అవదేమా అనిపించింది ఆమెకు. సాయంత్రమయింది. చీకటి పడింది. పూర్తిగా రాత్రి అయింది. భోజనాలుఅయాయి. మరదులూ, తోటికోడళ్ళూ ఎవరి గదులలోకి వాళ్లు చేరుకున్నారు.

ఈ పాటికి దానిమ్మ చెట్టు దగ్గరికి వీరయ్యవచ్చి వుంటాడు. ఆమె లేవబోయింది. కొడుకుఏడుపు ఆరంభించాడు. జోకొట్టింది. వాడు మానలేదు. కొంచెంసేపు పాలిచ్చి మళ్లీ పడుకోబెట్టబోయింది. వాడు పడుకోలేదు. గట్టిగా ఏడుస్తున్నాడు.

పాపం వీరయ్య పెరట్లో కనిపెట్టుకొని వుంటాడేమో!

కొడుకుమీద కోపం వచ్చింది. ఫెళ్లున నాలుగైదు దెబ్బలు వేసింది. వాడి ఏడుపు మరీ యెక్కువైంది. 'కొట్టబోకు, అప్పయ్యా, కొంచెం

జోల పాడవమ్మా' అని ప్రక్కనే గదిలో భర్తతో పడుకున్న చిన్న తోటి కోడలు కేక వేసింది.

నుంగమ్మకి కోపమూ, రోషమూ, పెన వేసుకుపోయాయి. వీరయ్య యింకా పాపం పెరట్లో అలా నిలుచోవలసినదేనా ?

పిల్లాడు ఏడుపు మానడే—

రెండు చేతులతోటీ శక్తికొద్దీ వాడి గొంతుక పిసికేసింది. నిమిషంలో పిల్లాడు ఏడ్పు మానేశాడు. సద్దుకాకుండా పెరట్లోకి వెళ్ళి వీరయ్యని కలుసుకొంది.

మళ్ళీ వచ్చిన తరువాత, పిల్లాడి మీద చెయ్యివేసి చూస్తే, ఊపిరి లేదు. కెవ్వున కేక వేసి, గొల్లుమంది.

# భయం

డాక్టర్ అంబాపతి యింకారాలేదు. శర్మా, మూర్తీ, రావూ, ముగ్గురూ అతనికోసం కనిపెట్టుకొని కూచున్నారు.

శర్మమాత్రం, తక్కిన ఇద్దరికంటె కొంచెం కళవళ పాటుపడుతూ వున్నట్టున్నాడు. మాటిమాటికీ తన చేతిగడియారం వంక చూస్తున్నాడు. మూర్తి తాపీగా చుట్ట కాలుస్తున్నాడు. రావు పత్రిక చదువుకుంటున్నాడు.

ఉన్నట్టుండి, "మనరొత్తు సరిగ్గా కొనసాగకపోతే, కొంప మునిగి పోతుంది" అన్నాడు శర్మ.

"మరేం భయంలేదు. చక్కగా కొనసాగుతుంది. కాని, నా భయ మల్లా ఒక్కటే. చేతులారా మహాపాతకం చేస్తున్నామే అని!" అన్నాడు మూర్తి, చుట్ట కొనవున్న కొడిని క్రిందకురాలుస్తూ. పేపరు చుట్టచుట్టి, బల్లమీదపడవేసి, 'మరేం పాపంలేదు. వాడు చేసిన వెధవపనికి, మనం చేసేది ఒకశిక్ష అవుతుంది కాని, మనకి పాపం యేమీ చుట్టుకోదు" అన్నాడు రావు.